రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:30
(ఆదివారం సాయంత్రం)
సహర్: 5:06 (సోమవారం ఉదయం)



మోదుగు సోయగం..



హోలీ అనగానే మోదుగు పూలు గుర్తుకు వస్తాయి. హోలీ పండగ రోజున ఈ పూలను ఉడక బెట్టి రంగుగా తయారు చేసి ఒకరిపై ఒకరు చల్లుకుంటారు. మరో వారం రోజుల్లో ఈ పండగ ఉన్న నేపథ్యంలో రావిర్యాల గ్రామంలో మోదుగు చెట్లు విరగపూసి కనువిందు చేస్తున్నాయి. ఆకులు రాలి చెట్టు నిండా ఉన్న ఎర్రని పూలు ఆకర్శణీయంగా కనిపిస్తున్నాయి. అలాగే కొమ్మలపై వాలిన పక్షులు ఆ చెట్లకు మరింత అందాన్ని తీసుకువచ్చాయి.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

తాగునీటి కోసం
తండ్లాట

- 20 రోజుల నుంచి నిలిచిన కృష్ణా వాటర్ సరఫరా
- దావుత్‌గూడలో అల్లాడుతున్న ప్రజలు
- వ్యవసాయ క్షేత్రాలను ఆశ్రయిస్తున్న గ్రామస్థులు





ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు, వ్యవసాయ బావి వద్ద నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు

కందుకూరు, మార్చి8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావుత్‌గూడలో ఇరవై రోజులుగా కృష్ణా నీరు సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి కోసం గ్రామస్తులు అల్లాడుతున్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించడం లేదని వాపోతున్నారు. చేసేది లేక వ్యవసాయ క్షేత్రాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న బోర్లు కూడా ఎండిపోయాయని తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవతో మూడు బోర్ల వేశారని, అవి కాలిపోవడంతో నీళ్లకు ఇబ్బంది అవుతుందని చెప్పారు. కృష్ణానీటిని సరఫరా చేసేవరకు బోర్లకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులు చొరవ చూపాలి

ఇరవై రోజులుగా దావుత్‌గూడలో కృష్ణా నీరు రావడం లేదు. సంబంధిత అధికారులు చొరవ చూపి గ్రామంలో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి. నీటి కోసం మహిళలు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాల్సి వస్తుంది. కనీసం బోర్లకు మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. కొందరు ట్యాకర్ల ద్వార నీటిని తెప్పించుకుంటున్నారు.

- తేజునాయక్, దావుత్‌గూడ

న్యాయం జరిగే వరకు
పోరాటం

- ఫార్మాసిటీ భూసేకరణలో రైతులకు తీవ్ర అన్యాయం
- మోసం చేసిన గత, ప్రస్తుత ప్రభుత్వాలు
- ఆకులమైలారంలో సీపీఎం నాయకుల పర్యటన



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కందుకూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కందుకూరు, యాచారం మండలాల్లో ఫార్మా కోసం భూసేకరణ చేసి రైతులకు తగు న్యాయం చేయడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డి.రాంచందర్ ఆరోపించారు. వారికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. శనివారం యాచారం మండలం ఆకులమైలారం గ్రామంలో సీపీఎం నాయకులు పర్యటించి భూములు కోల్పోయిన రైతులతో మాట్లాడారు. రెండు మండలాల్లోని 10 గ్రామ పంచాయతీల్లో ఉన్న భూములను గత ప్రభుత్వం రైతుల ప్రమేయం లేకుండా బలవంతంగా లాక్కుందని, అతితక్కువ నష్ట పరిహారం చెల్లించి చేతులు దులుపుకుందని వారు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫార్మా కోసం తీసుకున్న భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని మాట తప్పిందన్నారు. అంతేకాకుండా అధికారంలోకి వచ్చాక ఫోర్త్‌సిటీ, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పేరుతో రైతుల నుంచి వేల ఎకరాలను తీసుకుంటుందన్నారు. ఇందుకు నిరసనగా పార్టీ ఆధ్వర్యంలో 11న కుర్మిద్ద గ్రామంలో ఏర్పాటు చేయనున్న భూ సదస్సుకు బాధిత రైతులు హాజరుకావాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.శ్రీనివాస్, ఎ.కుమార్, నర్సింహా, కాశిదాసు, శ్రీరాములు, కృష్ణ, పి.జంగయ్య, గణేష్ పాల్గొన్నారు.



శనివారం నమోదైన ఉష్ణోగ్రతలు
రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్దలో 39.2 డిగ్రీలు
మేడ్చల్ జిల్లా కీసరలో 37.9 డిగ్రీలు
వికారాబాద్ జిల్లా తొర్రిమామిడిలో 38.0 డిగ్రీలు

వేసవి ఆరంభంలోనే భానుడు భగ్గుమంటున్నాడు. మార్చి మొదటి వారం నుంచే మంటలు పుట్టిస్తున్నాడు. సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఒకవైపు ఎండ సెగలు... మరోవైపు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10గంటలు దాటితే చాలు ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మార్చి నెలలోనే 40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా... ఏప్రిల్, మే నెలలో ఎండలు ఇంకా ఎలా ఉంటాయోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

మార్చిలోనే.. మంటలు!



ఉమ్మడి జిల్లాలో భగ్గుమంటున్న భానుడు



- వారం రోజుల్లో గరిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు
- వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రజలు
- అడుగు బయట పెట్టలేని పరిస్థితి
- కర్ఫ్యూను తలపిస్తున్న రహదారులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఎండలు ముదురుతున్నాయి. మునుపెన్నడూ లేనంతగా మార్చి మొదటి వారంలోనే భానుడు భగ్గుమంటున్నాడు. వారం రోజులుగా రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఒకటి నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వీధులు కర్ఫ్యూను తలపిస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మరోవైపు మండుతున్న ఎండలకు పొలాలు తడారిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

శివరాత్రి తర్వాత పెరిగిన ఎండలు

వేసవి ప్రారంభంలోనే భానుడు భగభగమంటున్నాడు. శివరాత్రి తర్వాత ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గడంతో ఉక్కపోత పెరిగింది. మార్చి నెల ప్రారంభంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువయ్యాయి. శనివారం

మిగతా 7వ పేజీలో...



మహిళలు సంఘటితంగా
పోరాడాలి

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇందిర



సమావేశంలో మాట్లాడుతున్న ఇందిర

ఆమనగల్లు, మార్చి8(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన, సమస్యల పరిష్కారం, సమానత్వం, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా మహిళలు సంఘటిత పోరాటాలు సాగించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇందిరా పిలుపునిచ్చారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో పురోగతిని సాధించి అభివృద్ధి వైపు దూసుకుపోతున్నామని పాలకులు గొప్పగా ప్రకటించుకుంటున్నా.. మహిళలపై దాడులు, హింస, అత్యాచారాలు, ప్రేమోన్మాద హత్యలు, ఆర్థిక అసమానతలు సమిసి పోలేదని పేర్కొన్నారు. ఆమనగల్లులోని మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం శ్రామిక మహిళా దినోత్సవ వేడుకలు సీఐటీయూ, సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అసమానతలు కారణంగా మహిళలు అవమానాలు, దాడులు, హింసకు గురవుతున్నారన్నారు. శ్రామిక మహిళలకు విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు మొండి చేయి చూపుతున్నాయన్నారు. రోజురోజుకూ నిరుద్యోగం, ఆకలి, పేదరికం, శ్రమ దోపిడీకి మహిళలు గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పనిగంటలు తగ్గించి మహిళలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మహిళలపై దాడులు, అత్యాచారాల నిరోధానికి ప్రభుత్వాలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఇందిరా కోరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మా, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కవిత, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పిప్పళ్ల శివశంకర్, సీఐటీయు జిల్లా నాయకుడు పెంటయ్య, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా నాయకురాలు పద్మ, ఆశా కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు నిర్మల, అనిత, బీబీ తదితరులు పాల్గొన్నారు.



పాండవుల గుట్ట మీద గుండ్లు

పాండవుల బండలు.. ప్రకృతి అందాలు

Sunday Special

- చూపరులను ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు, జాలువారే జలపాతాలు
- ఆకర్శిస్తున్న గద్దగుండు.. వేంకటేశ్వర ఆలయం
- పర్యాటక కేంద్రంగా గుర్తించాలని స్థానికుల డిమాండ్

ఎత్తైన కొండలు, జాలువారే సెలయేరు, పక్కనే ఎప్పుడూ నిండు కుండలా చెరువు, ఆ చుట్టుపక్కల పచ్చని ప్రకృతి సోయగం కనుల సంబురంగా ఉంటుంది. శీతాకాలంలో చుట్టూరా ఉన్న అడవి అందాలతో మైమరిపింపజేస్తున్నాయి. కులకచర్ల మండలంలోని తిరుమలాపూర్ గ్రామ పరిధిలోని పాండవుల బండలు ప్రకృతి అందాలకు నిలయంగా మారాయి. అటుగా వెళ్లే చూపరులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

7లో

- కులకచర్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి)

మత్స్య సంపదలో రెండో స్థానం

- ప్రధాని నరేంద్ర మోదీ కృషితో దేశం ముందంజ
- వినియోగంలోకి నూతన సాంకేతిక పరిజ్ఞానం
- కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్
- ఎయిర్‌పోర్టు నోవాటెల్‌లో ఫిషర్స్ స్టార్టప్ కాంక్లేవ్
- హాజరైన వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు



ఎన్ఎఫ్‌డీపీ మొబైల్ యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్

రంగారెడ్డి అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మత్స్య సంపదలో దేశం రెండో స్థానంలో ఉందని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అన్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని నోవాటెల్ హోటల్‌లో శనివారం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులతో ఫిషర్స్ కాంక్లేవ్ నిర్వహించారు. మరో కేంద్ర మంత్రి ఎస్‌పీ సింగ్ బగేల్‌తో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజీవ్ రంజన్ సింగ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే ఫిష్ మార్కెట్‌కు అత్యంత డిమాండ్ ఉందన్నారు. అందుకోసమే ప్రధాని మోదీ మత్స్య సంపద పెంపునకు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. మత్స్య సంపద పెరిగితే లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సంవృద్ధి సహ యోజన స్కీమ్ కింద మత్స్య కార్మికులను ఆర్థిక వనరులు సమకూర్చుతున్నట్లు తెలిపారు. చిన్న పరిశ్రమలను ఏర్పాటుకు మత్స్య రైతులకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తోందని చెప్పారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని మత్స్య సంపదను పెంచుకోవాలని ఆయన సూచించారు.

ఏడాదికి రూ.లక్ష కోట్ల విలువైన చేపలు

మన దేశానికి చెందిన ఒకవ్యక్తి దుబాయ్‌లో 800 ఎకరాల భూమిని తీసుకొని చేపల పెంపకం చేపట్టారని చెప్పారు. మన దేశం నుంచి ఏడాదికి లక్ష కోట్ల విలువైన చేపలను ఎక్స్‌పోర్ట్ చేస్తున్నామని తెలిపారు. మణిపూర్, వెస్ట్ బెంగాల్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు సంబంధం లేకుండా ఎంతో మంది పారిశ్రామికవేత్తలు మత్స్య సంపదను పెంచేందుకు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. మత్స్య సంపద పెంపు కోసం కృషి చేస్తున్న ఆయా వ్యాపారవేత్తలకు రూ.10 లక్షల రివార్డు సైతం ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక రాయితీ

చేపల పెంపకానికి కృషి చేస్తున్న ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక రాయితీ ఇస్తున్నామన్నారు. మున్ముందు చేపల పెంపకాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తుందని చెప్పారు. రూ.25 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం రుణాలు ఇస్తోందన్నారు. అనంతరం ఎన్ఎఫ్‌డీపీ యాప్‌ను ప్రారంభించారు. దీనిద్వారా ఆన్‌లైన్‌లో కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం మంత్రి ఎస్‌పీ సింగ్ బగేల్ మాట్లాడుతూ ప్రపంచ మార్కెట్‌లో ఫిష్‌కు చాలా డిమాండ్ ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రధాన మంత్రి చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. చిన్న చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహకాలు సైతం అందిస్తున్నట్లు తెలిపారు.

జలాశయంలోకి మురుగు



హిమాయత్ సాగర్‌లోకి మురుగు చేరుతోంది. కొత్వాల్‌గూడ గ్రామంలోని డ్రైనేజీ నీరు జలాశయంలోకి చేరుతుండటంతో కలుషితమవుతోంది. ఈ ప్రాజెక్టు నుంచి నగరంలోని బండ్లగూడ ప్రాంతానికి తాగునీరు సరఫరా అవుతుంది. తాగునీరందించే హిమాయత్ సాగర్‌లో డ్రైనేజీ వాటర్ కలుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్/బొంరాస్‌పేట్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): చిన్న, చిన్న తగాదాలతో కోర్టుల చుట్టూ తిరగకుండా కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం


కేసులను పరిశీలిస్తున్న జడ్జి శ్రీరామ్

చేసుకోవాలని కొడంగల్ మున్సిఫ్ కోర్టు జడ్జి శ్రీరామ్ అన్నారు. కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో బొంరాస్‌పేట్ పీఎస్ పరిధిలోని 15కేసులు, 34డ్రంకెన్ డ్రైవ్ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అబ్దుల్ రవూఫ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

ఘట్‌కేసర్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ యాదగిరి అన్నారు. బస్‌స్టాండ్‌లో జనచైతన్య సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రవీందర్, వెంకటేష్, వీరేందర్, ఆంజనేయులు, రాజు, శ్రీనివాస్. సురేష్ పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ యాదగిరి

అద్దె భవనంలో ఫార్మాసిటీ పీఎస్

- రెండు మండలాల ప్రజలకు దూరాభారం
- కుర్మిద్దలో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు
- మంత్రి వద్ద పెండింగ్‌లో ప్రతిపాదిత ఫైల్

యాచారం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల కోసం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌ను మండలంలోని మేడిపల్లిలో ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. కుర్మిద్ద సమీప మంగలిగడ్డతండా వద్ద స్థలం సేకరించి పోలీసు గృహనిర్మాణ విభాగానికి తెలియపర్చారు. పీఎస్ భవనం, సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణ ప్రతిపాదనల ఫైల్ నాలుగు నెలలుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వద్ద ఉన్నట్లు తెలుస్తోంది. ఫ్యూచర్ సిటీ, స్కిల్ యూనివర్సిటీల నిర్మాణాలు సాగుతున్నప్పటికీ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణంపై కదలిక లేదు. చాలా గ్రామాలకు దూరంగా మేడిపల్లిలో స్టేషన్ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త స్టేషన్ పరిధిలోకి వచ్చిన గ్రామాల వారు కొత్త కష్టాలతో సతమతం అవుతున్నారు. బేగరికంచ వద్ద అమోజాన్ సంస్థ కంపెనీ నడుస్తోంది. స్కిల్ డెవలప్మెంట్ వర్సిటీ భవనాల పనులూ సాగుతున్నాయి. కానీ స్టేషన్ నిర్మాణానికి పూనుకోవడం లేదు. ఇదిలా ఉంటే కందుకూరు మండలం సాయిరెడ్డిగూడ నుంచి మేడిపల్లి 24 కిలోమీటర్లు, ఆకులమైలారం నుంచి 18కిలోమీటర్లు, సార్లరావులపల్లి నుంచి 20కిలోమీటర్లు, ఎన్టీఆర్‌తండా నుంచి 20కిలోమీటర్ల దూరం ఉండడంతో స్టేషన్‌కు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉన్న పీఎస్‌లు ఇంత దూరం ఉండేవి కాదు. కొత్తగా ఏర్పాటైన ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో యాచారం మండలం మేడిపల్లినక్కర్త, నానక్‌నగర్, తాటిపర్తి, గొల్లగూడ, కుర్మిద్ద, మంగలిగడ్డతండా, మర్లకుంట తండా, కందుకూరు మండలం ఆకులమైలారం, మాలగూడ, మీర్ఖాన్‌పేట, ఎన్టీఆర్‌తండా, మంగలిగడ్డతండా, సార్లరావులపల్లి, ఉట్లపల్లి, పోతుబండతండా, గొట్టెలగడ్డతండా, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ గ్రామాలున్నాయి. ఈ గ్రామాలకు ప్రస్తుత ఫార్మాసిటీ పీఎస్ 18కిలో మీటర్లకుపైనే ఉంది. ప్రతిపాదిత స్థలంలో పోలీస్ స్టేషన్ కడితే అన్ని గ్రామాలకు సెంటర్లో చేరువగా ఉంటుంది. కాగా ఉంటే రెవెన్యూ మండలం కందుకూరు ఉంటే పీఎస్ మరో మండలంలో ఉండడం కూడా కొన్ని గ్రామాల ప్రజలకు కొత్త ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు, ప్రభుత్వం వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మేడిపల్లిలో హైదరాబాద్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్

విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలి

మేడ్చల్ టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవితంలో ఉద్యోగాలు చేసి జీవించే వారిలా కాకుండా నలుగురికి ఉద్యోగ అవకాశం కల్పించేలా ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదగాలని మైక్రోసాఫ్ట్ సీనియర్ డైరెక్టర్ ఆఫ్ ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ బి.భరత్‌కుమార్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ పరిధిలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన అక్విలా-2025 వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రపంచం సాంకేతిక రంగంలో విప్లవాత్మకంగా అభివృద్ధి చెందిందన్నారు. ఫలితంగా పోటీతత్వం పెరిగి కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు చదువుకుని ఉద్యోగం చేసుకుంటూ జీవితంలో స్థిరపడాలన్న ఆలోచనను వీడి నలుగురికి ఉపాధి కల్పించే మార్గాలను అన్వేషించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు అధ్యాపకులను సన్మానించారు. చదువుల్లో, క్రీడల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ టి.బాలరెడ్డి, కార్యదర్శి టీవీ.రెడ్డి, డైరెక్టర్ సరోజారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, ఎన్.చంద్రశేఖర్, పీఆర్వో రవి, సుధాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భరత్‌కుమార్

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి


నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటేష్, కమిటీ సభ్యులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లోని ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించే వరకు సమష్టిగా ఉద్యమించాలని రాష్ట్ర ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి రాజమోని జంగయ్య, ఉపాధ్యక్షులు కీర్తి వెంకటరమణ, కోశాధికారి ఎర్.మహేష్ పిలుపునిచ్చారు. శనివారం సంఘం జిల్లా నాయకులు విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో తుక్కుగూడలో ఏర్పాటు చేసిన జిల్లా సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. తమ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని, దీనికి రాష్ట్రంలో పనిచేస్తున్న ముదిరాజ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఏకం కావాలని పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ముదిరాజ్ ఉద్యోగుల, ఉపాధ్యాయుల రంగారెడ్డి జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి జంగయ్య ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎడ్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రాములు, ఉపాధ్యక్షులు బి.శంకర్, ఎస్.భాస్కర్, బాలకృష్ణ, రవీందర్, సహాయ కార్యదర్శులు పిల్లి రవీందర్, పిట్టల రాజేశ్వర్, జి.సుదర్శన్, ఆర్.చరణ్, కోశాధికారి ఎస్.మహేష్, పబ్లిసిటీ కార్యదర్శులు మంగ, రమేష్, సలహాదారులు ఎడ్ల కల్లేష్, వెంకటేస్, కార్యవర్గ సభ్యులుగా ఎ.మహదేవ్, జి.అశోక్, పి.జంగయ్య, ప్రేమ్‌కుమార్‌లను ఎన్నుకొని వారితో ప్రమాణస్వీకారం చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలో వివిధ మండలాల సంఘ బాధ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 25 నుంచి సనాతన భగవద్గీత భాగవత ధర్మ శంఖారావం

పంజాగుట్ట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గోల్డెన్ అవతార్ యూనివర్సల్ చైతన్య మహాప్రభు మహాభారత్ ఫౌండేషన్-హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని కన్హా శాంతివనంలో భగవద్గీత, భాగవత ధర్మ శంఖారావ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఏబీ.చైతన్యదాస్ తెలిపారు. ఏప్రిల్ 25 నుంచి 27వ తేదీ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సనాతన భగవద్గీత భాగవత ధర్మ శంఖారావ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. గో రక్షణ, భగవద్గీత రక్షణ కోసమే ఏప్రిల్ 25 నుంచి మూడు రోజుల పాటు కన్హా శాంతివనంలో సనాతన భగవద్గీత ధర్మ శంఖారావాన్ని నిర్వహిస్తున్నామని, లక్ష మంది శంఖారావాలను పూరిస్తారని, హరినామ సంకీర్తన జరుగుతుందని తెలిపారు. ఈ నెల 16న నెక్లెస్ రోడ్డులో రన్ ఫర్ గోమాత 5కే, 10కే రన్, వాక్ నిర్వహిస్తున్నామని మహేశ్వర గోశాల నిర్వాహకులు వీరారెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న నాగప్రతిష్ఠాపన వేడుకలు

వికారాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్లమ్మ తోటలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ తల్లి సహిత పరశురామ నాగ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. రెండో రోజు శనివారం పూజల్లో భాగంగా ఆవాహిత పూజ, నవగ్రహ ఆవాహనం, పుష్పాదివాసం, నవగ్రహ హోమం, వాసుప్రతిష్ఠ, హోమాలు, మధ్యాహ్నం హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొని పూజలు చేశారు. ఆలయ పునర్‌కర్త మాజీ కౌన్సిలర్ రత్నారెడ్డి ఆయనను సన్మానించారు. వికారాబాద్ పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు.


హోమంలో పాల్గొన్న దంపతులు

వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు

దుద్యాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, జిల్లా నాయకులు సత్తయ్య, చిలకమూరి సత్తయ్య, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణలో క్రీడాభివృద్ధికి సహకరించండి

- కేంద్ర క్రీడామంత్రి మన్సుఖ్‌కు జితేందర్, శివసేనారెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణలో క్రీడారంగం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం కావాలని క్రీడామంత్రి మన్సుఖ్ మాండవీయను రాష్ట్ర ప్రభుత్వ క్రీడాశాఖ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, శాట్ ఛైర్మన్ శివసేనారెడ్డిలు కోరారు. శనివారం నందిగామ మండలంలోని కన్హా ఆశ్రమంలో జరిగిన చింతన్ శిబిర్ రెండో రోజు కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. భవిష్యత్తులో తెలంగాణ ప్రభుత్వం చేపట్టబోయే వివిధ క్రీడా కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు అందించాలని కోరారు. మెదక్‌లోని 'సాయ్' సెంటర్‌ను తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖ కార్యదర్శి జయేష్ రంజన్, శాట్ వీసీ-ఎండీ సోనీ బాలాదేవి, శాట్ అధికారులు వెంకటేశ్వరరావు, నంది కిశోర్ గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

పాండవుల బండలు.. ప్రకృతి అందాలు

- ఆకర్శిస్తున్న గద్దగుండు.. వేంకటేశ్వర స్వామి ఆలయం
- పర్యాటక కేంద్రంగా గుర్తించాలని స్థానికుల డిమాండ్

కులకచర్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పాండవుల బండ తిరుమలాపూర్ గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. కులకచర్లకు 6 కి.మీ దూరంలో ఉంది. ఆ ప్రాంతానికి వెళ్తే పచ్చని చెట్లు, జాలువారుతున్న జలపాతాలు దర్శనమిస్తాయి. ఈ ప్రాంతాన్ని పండుగల సాయన్న గుట్ట అని కూడా పిలుస్తారు. ఇక్కడ పండుగల సాయన్న గుండు, గద్ద గుండు, గుండు మీద గుండు, నిండుగా పారుతున్న కుంట చూపరులను ఆకట్టుంటాయి. పాండవుల గుట్ట పక్కనే గద్ద గుండు ఉంది. గుండుపైకి ఎక్కాలని ఇప్పటికే ఎంతో మంది ప్రయత్నించి విఫలమయ్యారు. గుండుపైకి ఎక్కేందుకు సాధ్యం కావడం లేదు. ఈ గుండుపై ఒకప్పుడు గద్దలు గుంపులు, గుంపులుగా కూర్చునేవని పూర్వీకులు చెబుతుంటారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఇప్పటికీ పాండవుల గుట్టపై వన భోజనాలు చేసి వెళ్తుంటారు.


పాండవుల బండల వద్ద కన్పిస్తున్న ప్రకృతి అందాలు

గుండుపై గుండు ఇక్కడి ప్రత్యేకం!

పాండవులు ఇక్కడ రాళ్లతో గోటిలు ఆడుకోగా గుండుమీద గుండు ఏర్పడినట్లు స్థానికులు కథలుగా చెబుతుంటారు. గుండుపైన గుండు నిలిచిన చోటు చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ ప్రాంతంలో సీతాఫలాలు సమృద్ధిగా లభిస్తాయి. పాండవుల గుట్టకు వెళ్లే దారిలో వేంకటేశ్వరాలయం ఆలయం ఉంది. రజాకార్ల హయాంలో గుట్టపైన ఉన్న ఈ ఆలయంలోని విగ్రహాన్ని ధ్వంసం చేశారని పూర్వీకులు చెబుతుంటారు. ఇప్పటికీ పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తుంటారు. ఇక్కడి స్వామివారికి మాంసంతోనే నైవేద్యం సమర్పిస్తారు. కోళ్లను బలిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.


పాండవుల గుట్ట

పర్యాటక కేంద్రంగా గుర్తించాలి



పాండవుల గుట్ట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ఇక్కడి ప్రకృతి అందాలు ఆకట్టుకుంటాయి. గద్ద గుండు, గుండు మీద గుండు ఇక్కడ ప్రత్యేకం. ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా గుర్తించాలి.

- రాములుగౌడ్, తిరుమలాపూర్

సేవల్లో లయన్స్ క్లబ్‌కు అవార్డు

ఆమనగల్లు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆమనగల్లు లయన్స్ క్లబ్‌కు ఉత్తమ క్లబ్ అవార్డు లభించింది. 2024-25సంవత్సరానికి రాష్ట్ర స్థాయి గ్రామీణ క్లబ్‌లలో ఆదర్శంగా నిలిచింది. బెస్ట్ బ్యానర్ ప్రజంజేషన్‌లో మొదటి స్థానంలో నిలిచింది. శనివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో లయన్స్ క్లబ్ 320-ఎ మహోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో 91 క్లబ్‌లు పాల్గొన్నాయి. ఆమనగల్లు క్లబ్ సేవా కార్యక్రమాల్లో అగ్రభాగంలో నిలిచినట్లు ప్రకటించి అవార్డులను ప్రదానం చేశారు. ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఐదు మెగా వైద్య శిబిరాలు, నాలుగు గుండు వైద్య శిబిరాలు, 21 అన్న ప్రసాద వితరణలు, ఎండ కాలంలో అంబలి కేంద్రం ఏర్పాటు, కంటి, దంత వైద్య శిబిరాలు, మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు విరివిగా నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్‌వో పాషా తెలిపారు. అవార్డు కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్లు చెన్న కిషన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జిల్లా చైర్మన్‌లు బండెల రామచంద్రారెడ్డి, ఓంకారం, రాంరెడ్డి, రమేశ్, రామ్మోహన్‌రావు, లింగయ్య, అంజయ్య, నర్సింహ, యాదయ్య, సుధ, బిక్షపతి, రమేశ్, బాబు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



బెస్ట్ క్లబ్ బ్యానర్‌ను అందజేస్తున్న చెన్న కిషన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి

ధైర్యంగా ఉండండి.. ప్రభుత్వం సహకరిస్తుంది

- గంప ప్రవీణ్ కుటుంబీకులకు ఎంపీ డీకే.అరుణ పరామర్శ
- మృతదేహం తరలించినట్లు మెయిల్ వచ్చిందని వెల్లడి

కేశంపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి దుండగుల చేతిలో హత్యకు గురైన తెలంగాణ విద్యార్థి గంప ప్రవీణ్ తల్లితండ్రులు గంప రాఘవులు, రమలను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ శనివారం ఫోన్ ద్వారా పరామర్శించారు. ప్రవీణ్ కుటుంబంతో ఎంపీ మాట్లాడుతూ.. కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. అమెరికా నుంచి ప్రవీణ్ మృతదేహం తరలించినట్లు తమకు మెయిల్ వచ్చిందని తెలిపారు. నేడు ఆదివారం మధ్యాహ్నం 2గంటల వరకు ప్రవీణ్ మృతదేహం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ చేరుకుంటుందని తెలిపారు. త్వరలో ఇంటికొచ్చి పరామర్శిస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం మృతదేహం తరలింపునకు సహకరించిదని తెలిపారు. కేంద్రం తరపున తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.


ఎంపీ డీకే.అరుణతో ఫోన్‌లో మాట్లాడుతున్న రాఘవులు

ఆర్యవైశ్య సంఘం నాయకుల పరామర్శ

ఆర్యవైశ్య సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మిడిదొడ్డి శ్యాంసుందర్ గంప ప్రవీణ్ కుటుంబీకులను పరామర్శించారు. సంఘటన వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట గంప శ్యాంసుందర్ ఉన్నారు.

నేడు స్వస్థలానికి ప్రవీణ్ మృతదేహం

గంప ప్రవీణ్ ప్రవీన్ మృతదేహం అమెరికా నుంచి పంపుతున్నట్టు అధికారులకు, కుటుంబ సభ్యులకు మెయిల్‌లు వచ్చాయి. ఆదివారం మధ్యాహ్నానికల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ శంషాబాద్ ఏసీపీతో మాట్లాడారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీధర్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

మహిళలు సొంత నిర్ణయాలతో ఎదగాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

మేడ్చల్ టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ సొంత నిర్ణయాలతో ముందుకు సాగిననాడే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదుగుతారని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. శనివారం మల్లారెడ్డి యునివర్సిటీ, మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కాలేజిలో నిర్వహించిన అంతర్జాతీ మహిళాదినోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు తమ జీవితాలను తీర్చిదిద్దుకునే విషయంలో ప్రతీ దానికి ఇతరుల సలహాలు, సూచనలపై ఆధారపడకుండా సొంత నిర్ణయాలతో ముందుకు దూసుకుపోవాలన్నారు. నేడు ప్రపంచం సాంకేతికంగా, విద్యాపరంగా ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతోందని, ఇందులో మహిళల పాత్ర విడదీయలేదని దన్నారు. మహిళ లేనిదే మానవ మనుగడ లేదని, మగవారితో పోలిస్తే మహిళ దేనిలోనూ తక్కువ కాదన్నారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీపడి ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగారని తెలిపారు. అనంతరం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ రంగంలో మహిళల ప్రాధాన్యం పెరిగిందన్నారు. స్వయంకృషి, పట్టుదలతో మహిళలు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగారన్నారు. దేనిలోనూ మహిళలు వెనకడు వేయకుండా ఆత్మస్థైర్యం, మనోబలంతో ముందుకు దూసుకుపోవాలని పిలుపునిచ్చారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా ధైర్యంగా, స్వతంత్రంగా బాహ్య ప్రపంచంలో అగుగుపెట్టిన నాడే వారిలోని నైపుణ్యం బయటపడుతుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ వీఎస్కే.రెడ్డి, వర్సిటీ విశ్వవిద్య ఫిట్ వీసీ ప్రీతిరెడ్డి, యూనివర్సిటీ చాన్స్‌లర్ కల్పన, కాలేజీ ప్రిన్సిపాల్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

తాండూరు: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ టి.స్వప్న అన్నారు. తాండూరులోని ఆర్టీసీ డిపోలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్వప్న హాజరై మాట్లాడారు. మహిళలు ముందుకు వచ్చినాడే సాధికారత సాధిస్తామన్నారు. మాజీ కౌన్సిలర్లు లావణ్య, అనురాధ, ఉద్యోగిని అరుణ పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ ఆఫీసులో కార్మికులతో మార్వాడీ మహిళలు హోలీ ఆడారు.


తాండూరు ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఉద్యోగినులు


కార్మికులతో హోలీ ఆడుతున్న మహిళ

లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌గా మహేంద్రకుమార్‌రెడ్డి



లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కందుకూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు, భూలక్ష్మీ మెమోరియల్ హాస్పిటల్ నిర్వాహకులు జి.మహేంద్రకుమార్‌రెడ్డి లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఎ గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో శనివారం క్లబ్ 9వ వార్షికోత్సవంలో జరిగిన ఎన్నికల్లో ఆయన జిల్లా గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇంటర్నేషనల్ డైరక్టర్ లయన్ సునీల్‌కుమార్, మల్టిపుల్ చైర్మన్ రాజిరెడ్డి, జిల్లా గవర్నర్ డి.కోటేశ్వర్‌రావు తెలిపారు. 2007-08 లో కందుకూరు లయన్స్ క్లబ్ వ్యవస్థాపనకు డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి కృషిచేశారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు కందుకూరు మండలం, జిల్లాలో సేవాకార్యక్రమాలు చేపడుతున్న మహేంద్రకుమార్‌రెడ్డి.. శ్రమ, పట్టుదల, అంకితభావానికి నిదర్శనమన్నారు.

బాధ్యత మరింత పెరిగింది

హైదరాబాద్, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, అలాగే నైజాం పాలనలోని కల్యాణ కర్ణాటక ప్రాంతాల్లో లయన్స్ క్లబ్‌లు మొత్తం 90 కలిసి 320-ఎగా పిలుస్తారన్నారు. ఈ క్లబ్‌లకు ఏడాది పాటు తాను జిల్లా గవర్నర్ పదవి తీసుకోవడంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు అంజయ్య, ఎస్.విఠల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లుగుప్తా, వెంకట్‌రంగారెడ్డి, రాంరెడ్డి, జి.అమరేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

చేవెళ్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని పంచాయతీ కార్మికుల యూనియన్ డివిజన్ ఉపాధ్యక్షుడు నగేశ్ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో చేవెళ్లలో గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 1 నుంచి ప్రతి నెలా వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా నేటికీ అమలు కాలేదన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలను ఎప్పటికప్పుడు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్టీవోల్లో నిలిచిపోయిన బకాయి వేతనాలను ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. పంచాయతీ ఫండ్ ఫ్రీజింగ్ ఎత్తివేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, నాయకులు సుజాత, భూపాల్, స్వామి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సాంకేతిక రంగంలో ఆవిష్కరణలు అందించాలి

- ఇస్రో శాస్త్రవేత్త రాఘవేంద్ర కునే
- సింబియాసిస్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మొదటి సాంకేతికోత్సవం

రంగారెడ్డి అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక రంగంలో పరిశోధనలు చేసి నూతన ఆవిష్కరణలు అందించాలని ఇస్రో శాస్త్రవేత్త రాఘవేంద్ర కునే సూచించారు. నందిగామ మండలంలోని సింబియాసిస్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మొదటి సాంకేతికోత్సవాన్ని 'అన్వేషణ-2025' పేరుతో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథి రాఘవేంద్ర హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అంతరిక్ష పరిశోధనలో డేటా ప్రాసెసింగ్ ప్రాముఖ్యాన్ని వివరించారు. సాంకేతిక రంగంలో సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు. మేక్ ఇన్ ఇండియా ప్రాధాన్యాన్ని వివరించి దేశ సాంకేతికతను స్వదేశీయంగా అభివృద్ధి చేయడం ముఖ్యమన్నారు. కొత్త ఆవిష్కరణలు సృష్టించి ఉత్పత్తులుగా మార్చే ప్రయత్నాలు చేయాలన్నారు. కష్టపడేతత్వం, నేర్చుకునే ఆసక్తి ఉన్న విద్యార్థులు జీవితంలో ఎప్పుడూ విజయాన్ని సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాభివృద్ధికి, ఆవిష్కరణలకు, కొత్త ఆలోచనలకు దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులకు ఈ వేదిక ఉపయోగపడుతుందని కళాశాల డైరక్టర్ రజనీకాంత్ అన్నారు. కార్యక్రమంలో అట్లస్ ఫైనాన్షియల్ రీసెర్చ్ కన్సల్టెంగ్ అధ్యక్షుడు విజయ్‌వేదాంతం, శశాంక్ చౌబే, ప్రొఫెసర్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


సింబియాసిస్‌లో ఇంజనీరింగ్ సాంకేతికోత్సవంలో పాల్గొన్న ఇస్రో శాస్త్రవేత్త రాఘవేంద్ర కునే, కళాశాల డైరక్టర్ తదితరులు

కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్

చేవెళ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కోర్టు కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నామని చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి దశరథరామయ్య అన్నారు. శనివారం చేవెళ్ల కోర్టులో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 970 కేసులను పరిష్కరించి రూ.14.24 లక్షలు జరిమానాలు, కోర్టు ఫీజులు వసూలు చేశారు. జడ్జి మాట్లాడుతూ.. అర్జీదారులు, కక్షిదారులు రాజీకి రాగలిగే కేసులను లోక్ అదాలత్‌లో సత్వరం పరిష్కరించుకోవచ్చన్నారు. చిన్న కేసులను త్వరగా పరిష్కరించుకుంటే కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. ఇక్కడ పరిష్కరించిన కేసులను హైకోర్టుల్లో అప్పీలు చేసుకునే అవకాశం ఉండదన్నారు. సమావేశంలో రిటైర్డ్ జడ్జి సాంబశివరావు, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు ఉన్నారు.



చేవెళ్ల కోర్టులో మాట్లాడుతున్న జడ్జి దశరథరామయ్య

మార్చిలోనే మంటలు!

(ఐదో పేజీ తరువాయి)

రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మొగిలిగిద్దలో 39.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, మేడ్చల్ జిల్లా కీసరలో 37.9 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా తొర్రిమామిడిలో 38.0 డిగ్రీలు గరిష్ఠంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో మార్చిలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు (డిగ్రీ సెల్సియస్‌లో..)

తేదీ	రంగారెడ్డి	మేడ్చల్	వికారాబాద్
08	39.2	37.9	38.0
07	37.5	37.5	36.6
06	37.9	37.2	37.4
05	39.2	38.8	38.9
04	39.0	39.1	39.8
02	38.2	38.8	38.1
01	38.1	36.3	37.8

రోడ్లు నిర్మానుష్యం..

ఉదయం 10 గంటలు దాటితే జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండ తీవ్రతకు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న సమయంలో జనం తిరగక రోడ్లు, మార్కెట్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు బోసిపోతున్నాయి. సాయంత్రం 5గంటలు దాటినా ఎండ తగ్గటం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చిన్నారులు, వృద్ధులు పదిలం

ఉమ్మడి జిల్లాలో ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో తప్పని పరిస్థితుల్లో బయటకు వచ్చేవారు రక్షణ చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవిలో ఎక్కువగా చిన్నారులు, వృద్ధులు డీ హైడ్రేషన్‌కు గురయ్యే అవకాశాలుంటాయని పేర్కొంటున్నారు. వడదెబ్బ బారినపడే ప్రమాదం ఉండటంతో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి పెద్దపీట

తలకొండపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాల పునరుద్ధరణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. దేవుని పడకల్‌లో ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రూపొందించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను శనివారం మాజీ సర్పంచ్ శ్రీశైలం, వంశీచంద్‌రెడ్డి, రవి ఆవిష్కరించారు. ఉత్సవాలకు రావాలని వారికి ఆహ్వానపత్రికలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, బిక్షపతి, కుమార్ ఉన్నారు. అలాగే బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్‌లకు సైతం ఆహ్వాన పత్రికలు ఇచ్చామని శ్రీశైలం తెలిపారు.


వంశీచంద్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న శ్రీశైలం, నాయకులు

చరిత్రపై మక్కువే.. చరిష్మా తెచ్చింది

- హ్యాట్రిక్ గిన్నిస్ రికార్డులు కొండపనేని శంకర్‌రావు సొంతం
- నాణేల సేకరణలో ఘనాపాటి
- 153 దేశాల కాయిన్లు ... 120 దేశాల స్టాంప్‌లు సైతం!
- భావితరాలకు ఏదైనా అందించాలన్న తపనే నడిపించింది
- ఇదీ మూడు దశాబ్దాల విజయగాథ

భావితరాలకు తన వంతుగా ఏదైనా అందించాలనే తపనే గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డును చేరువ చేసింది. ఒకటా రెండా ఏకంగా హ్యాట్రిక్ రికార్డులు ఆయన సొంతం. చదువుకుంటున్న రోజుల్లో చరిత్ర తెలుసుకోవాలన్న తాపత్రయం మూడు దశాబ్దాలుగా రెట్టించిన ఉత్సాహమే ముందుండి నడిపిస్తోంది. నాణేల సేకరణలో మేటిని చేసింది. ఆ ఇష్టమే స్టాంపులు సేకరణకూ దోహదపడింది. అంతేనా.. తనలోని కళాకారుడిని.. ప్రకృతి ప్రేమికుడిని పరిచయం చేసింది. కుంచె పట్టి బొమ్మలు గీయడం.. ఇంటి ఆవరణలో రకరకాల పండ్లు, పూల మొక్కలతో ఆహ్లాద వాతావరణాన్ని సృష్టించుకున్నారాయన. ఇదీ కొండపనేని శంకర్‌రావు ప్రస్థానం.


గిన్నిస్ రికార్డులతో శంకర్‌రావు కొండపనేని


సేకరించిన స్టాంపులు

ఇబ్రహీంపట్నం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కొండపనేని శంకర్‌రావు వృత్తిరీత్యా జర్నలిస్టు. ఆయన ప్రవృత్తి నాణేల సేకరణ. ఎనిమిది నెలల వ్యవధిలో మూడుసార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను సొంతం చేసుకున్నారు. ఆయనకీ జిజ్ఞాస ఈనాటిది కాదు. 30ఏళ్ల క్రితమే మొదలైంది. నాటి నుంచి ఇప్పటికి కూడా నిరాటకంగా కొనసాగుతోంది. మౌర్యులు, కుషానులు, గుప్తులు, ఢిల్లీ సుల్తానులు, మొగలులు, బ్రిటిష్ ఇండియా కాలం నుంచి ఇప్పటి వరకు దేశాన్ని పాలించిన అనేక మంది రాజుల, నాయకులకు సంబంధించిన నాణేలెన్నో ఆయన సేకరించారు. ఇలా మొత్తంగా 153 దేశాల కాయిన్స్ ఆయన వద్ద ఉన్నాయి. వీటిలో అరుదైన సందర్భాల్లో అంటే వ్యక్తులు, సంస్థల ప్రపంచ వ్యాప్త గుర్తింపు కోసం బై-మెటాలిక్(ద్విలోహ) నాణేలను ప్రభుత్వాలు ముద్రిస్తుంటాయి. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ద్విలోహ రూ.10, రూ.5, 2ల నాణేలను విడుదల చేసింది. వీటితో పాటు నాణేల్లో ముద్రణ లోపాలున్నవి, కన్మ్యూమరేటివ్ కాయిన్స్, ప్రస్తుతం ముద్రణలో ఉన్న ఫెనటిక్ స్టీల్ కాయిన్లను కూడా ఆయన సేకరించడం చెప్పుకోదగిన అంశం.




వివిధ దేశాలకు చెందిన బై-మెటాలిక్ నాణేలు

ఎనిమిది నెలల్లో ..

1,578 ముద్రణ లోపాలున్న నాణేల సేకరణకు గాను 2023 ఆగస్టు 17న తొలిసారి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలు, రాజ్యాలు విడుదల చేసిన 3,526 రకాల నాణేలను సేకరించినందుకు గాను 2024 జనవరి 14న రెండోసారి ఇదే రికార్డు సొంతం చేసుకున్నారు. 7,369 నాణేల సేకరించి మార్చి 2024లో మూడోసారి సైతం ఈ రికార్డును సొంతం చేసుకున్నారు. ఇలా ఎనిమిది నెలల్లో మూడు రికార్డులను సాధించిన ఘనత ఆయన సొంతం. ఇవే గాక 120దేశాల పోస్టల్ స్టాంపులను సైతం సేకరించారు. పెయింటింగ్స్‌లో కూడా ఆయనది అందెవేసిన చేయి. ఖాళీ సమయాల్లో కుంచెకు పని చెబుతారు. ఆపై ప్రకృతి ప్రేమికుడు. ఆయన నివాసం ఉన్న ఇంటి ఆవరణలో రకరకాల పండ్లు, పూల మొక్కలు ఉన్నాయి. ఇవేకాక కూరగాయలు, ఆకు కూరలు పెరట్లోనే సాగు చేస్తారు.

భవిష్యత్తు తరాలకు అందించాలనే..



నేను పుట్టి పెరిగింది కృష్ణా జిల్లా మున్నలూరు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఆర్కేడియాలో స్థిరపడ్డా. చారిత్రక నేపథ్యమున్న అమరావతిలో చదువుకున్నా. నాకు చరిత్ర తెలుసుకోవడం ఇష్టం. వివిధ రకాల నాణేలు, పెయింటింగ్స్ చిన్నప్పటి నుంచే చేసేవాడిని. సాధారణ లావాదేవీల్లో వినియోగించే ప్రతీ నాణేన్ని భద్రపర్చాను. పురాతన నాణేలపై ఉన్న చిహ్నాలు, లిపిని గమనిస్తూ వాటి చరిత్రను తెలుసుకునే వాడిని. భవిష్యత్తు తరాలకు ఏదైనా అందించాలనేది సంకల్పాన్ని పెట్టుకుని 30ఏళ్లుగా వేల సంఖ్యలో నాణేలు సేకరించాను. కరోనా సమయం కూడా నాకు కలిసొచ్చింది. 30ఏళ్లుగా సేకరించిన నాణేలను క్రమపద్ధతిలో అమర్చడంతోపాటు వాటి చారిత్రక విశేషాలను పొందుపరుస్తూ ఆల్బమ్ రూపొందించాను. ఇది విద్యార్థులకు, చరిత్రకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- కొండపనేని శంకర్‌రావు

మహిళలను గౌరవిద్దాం

▶▶ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

▶▶ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలు, విభాగాల్లో పనిచేస్తున్న అతివలకు సన్మానం



ఆమనగల్లు : మాజీ జడ్పీటీసీ అనురాధతో కలిసి కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

షాద్‌నగర్ అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో శనివారం ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో క్యాంపు ఆఫీసులో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళలను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈసందర్భంగా మహిళా శక్తిని గుర్తుచేస్తూ ఎమ్మెల్యే శంకర్ మహిళలను అభినందించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎంపీ డీకే అరుణను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు శాఖలో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని సన్మానించి, అభినందనలు తెలిపారు. షాద్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఉషతో పాటు మహిళా సిబ్బందిని న్యాయవాది సబియా సుల్తాన సన్మానించి, అభినందనలు తెలిపారు. షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న మహిళా డాక్టర్లను కమ్మ మహిళా సేవా సమితి సభ్యులు సన్మానించారు. అలాగే 70మంది ఆశాకార్యకర్తలకు, ఇతర మహిళా సిబ్బందికి చీరలను పంపిణీ చేశారు. పంపిణీ చేసిన వారిలో పాతూరి హైమావతి, పాతూరి ఇందిర, నువ్వుల రమాదేవి, పినపాక మంగాదేవి, అంజలి తదితరులున్నారు. చౌడమ్మగుట్ట అంజనేయస్వామి ఆలయానికి వచ్చిన మహిళా భక్తులకు మాజీ కౌన్సిలర్ లతశ్రీ శ్రీశైలంగౌడ్ సన్మానించారు.

కొత్తూర్ : మండలంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇన్మునర్వ గ్రామ పంచాయతీలో ఎంపీడీవో అరుంధతిని గ్రామ మహిళలు సన్మానించి, అభినందనలు తెలిపారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలను సన్మానించి, అభినందనలు తెలిపారు.

రంగారెడ్డి అర్బన్ : మండల కేంద్రంలో నందిగామకు చెందిన కేశమోని శ్రీనివాస్‌యాదవ్ పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లను, ఆశాకార్యకర్తలను, మహిళా సంఘం సభ్యులను సన్మానించి సత్కరించారు. వారితో కేక్ కట్ చేయించి బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. లోక్‌సత్తా లక్ష్మణ్, మారుతి, బాలు, నర్సింగ్, దినేష్, అర్జున్, ప్రవీణ్ ఉన్నారు. అలాగే మహిళలు భయం వీడి అన్ని రంగాల్లో రాణించాలని జిల్లేడ్ చౌదరిగూడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలను సన్మానించారు. కొందుర్గు మండలం భైరంపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు బాబురావు, జబ్బార్, అన్వర్, శ్రీను, అంజయ్య, వెంకటేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : సంతాపూర్‌లో హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కడ్తాల్ మండలం టికరాజ్‌గూడ డెయిరీ ప్లాంట్ మేనేజర్ ఆధ్వర్యంలో సంతాపూర్‌లో హెరిటేజ్ పాలసేకరణ కేంద్రం ప్రతినిధి ఆవ మమతను సన్మానించారు. పాలుపోసే మహిళలను కూడా సన్మానించారు. సూపర్‌వైజర్ శివ, వెటర్నరీ అసిస్టెంట్ సందర్శిలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. శ్రామిక మహిళలను సన్మానించారు. మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, శ్రామిక మహిళా జిల్లా నాయకురాలు వై.స్వప్న, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామ్యేల్, మండల సీపీఎం కార్యదర్శి బుగ్గరాములు, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేష్, మహిళా సంఘం మండలాధ్యక్షురాలు మున్ని తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ అనురాధపత్యనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేష్, మాజీమార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాధమ్మవెంకటయ్య, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు సయ్యద్ ఖలీల్‌లతో కలిసి జైపాల్ యాదవ్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. మహిళలను పూలమాలలు,శాలువాలతో సత్కరించారు. బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు నిరంజన్‌గౌడ్, రమేశ్‌నాయక్, సైదులు గౌడ్, కమటం వెంకటయ్య, సతీష్, తదితరులున్నారు. ఆకుతోటపల్లిలో నిర్వహించిన వేడుకల్లో మాజీ సర్పంచ్ శ్రీపాతి రజిత, కార్యదర్శి వినోద్, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మహిళల సాధికారిత, ఆర్థికాభివృద్ధి, సమానత్వం, రక్షణకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఎంపీడీవో సుజాత, గీతనర్సింహ, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు హన్మనాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహిళా ఉద్యోగులు, కార్మికులు, నాయకులతో కలిసి కేక్‌కట్ చేశారు. వివిధ రంగాలకుచెందిన మహిళలను సత్కరించారు. మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు కడారి రామకృష్ణ, పిప్పళ్ల వెంకటేశ్, లక్ష్మయ్య, జహంగీర్‌అలీ, బ్రహ్మచారి, జహంగీర్‌బాబా, రామచంద్రయ్య, తదితరులున్నారు. ఆమనగల్లు పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ గంప వెంకటేశ్ అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. మహిళా డైరెక్టర్లు అరుణ, జంగమ్మ లను సన్మానించారు.

యాచారం : మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ ఇన్‌స్పెక్టర్ లిక్కి కృష్ణంరాజు, యాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై తేజంరెడ్డిలు అన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో మహిళా కానిస్టేబుళ్లను, తాటిపర్తిలో జీపీ కార్మికులను సత్కరించారు. యాచారం గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్మికులను కార్యదర్శి తిరుపతయ్య, మండల మహిళా సమాఖ్య కార్యదర్శి మస్కు అరుణలు పంచాయతీ కార్మికులతో పాటు పలువురు మహిళలను సత్కరించారు.



షాద్‌నగర్ అర్బన్ : మహిళా ఉద్యోగులను సన్మానించి, మహిళా శక్తికి జై కొడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మేడిపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులు కేక్ కట్ చేసి పలువురు మహిళలను సత్కరించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్, ఎమ్మార్పీఎస్ ఇబ్రహీంపట్నం నాయకులు కె.భాస్కర్, యాచారం మండల నాయకులు బోడ కృష్ణ, విజయ్‌కుమార్ తదితరులున్నారు. గడ్డమల్లాయాగూడలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు మహిళలను సత్కరించారు. మహిళాలకు జూట్‌బ్యాగ్‌ల తయారీ, కుట్టుపని, పాల ఉత్పత్తుల తయారీ, పుట్టగొడుగుల పెంపకం, ఎంబ్రాయిడరీ, తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, డైరెక్టర్ సుగ్రీవరెడ్డి, శ్రీలత తదితరులు ఉన్నారు.

షాబాద్ : మహిళలు అన్నిరంగాల్లో ముందున్నప్పుడే కుటుంబంతోపాటు దేశం అభివృద్ధి సాధిస్తుందని ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, ఎంపీడీవో అపర్ణ అన్నారు. సర్దార్‌నగర్‌లో ప్రత్యేక గ్రామసభ నిర్వహించి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐఆర్డీ కోఆర్డినేటర్ విద్యాలత, కార్యదర్శి విజయ్‌సింహా, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

మంచాల : ఆరుట్ల గ్రామపంచాయతీ మహిళా సిబ్బందిని సత్కరించారు. మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్లేష్, గుడ్డిమల్ల చంద్రయ్య, ఆనంగళ్ల యాదయ్య, కావలి శ్రీనివాస్, మత్రు, రాజు, కుమార్, నూకం తదితరులున్నారు.

రంగారెడ్డి అర్బన్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఆ పార్టీ మండల నాయకులు సరికొండ జగన్ అన్నారు. కందుకూరు గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మహిళ కార్మికులను సన్మానించారు. నాయకులు గాదె కుమార్, ఎడ్ల కృష్ణ, కార్మికులు జి.రాములు, తదితరులున్నారు.



యాచారం : కార్మికులను సత్కరిస్తున్న హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు



కందుకూరు : జీపీ కార్మికులను సన్మానించిన కాంగ్రెస్ నాయకుడు సరికొండ జగన్

క్రైం కార్నర్





శంబారెడ్డి (ఫైల్), మోకిలలో రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసే క్రమంలో విద్యుత్ షాక్!
- సమాచారం ఇవ్వకుండా శవాన్ని మార్చురీకి తరలించడంపై గ్రామస్తులు, కుటుంబీకుల ఆగ్రహం

శంకర్‌పల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మండల పరిధిలోని టంగటూరు గ్రామానికి బద్దం శంబారెడ్డి(47) సినిమా షూటింగ్‌లకు లొకేషన్లు చూపించగా వచ్చే పారితోషికంతో జీవించేవాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి ఓదెల రైల్వేస్టేషన్ సినిమా షూటింగ్ ఉండటంతో షూటింగ్ వాహనాలు టంగటూరు వచ్చాయి. సన్నివేశాలు చిత్రీకరించేందుకు ఉపయోగించే క్రేన్ బురదలో ఇరుక్కుపోయింది. అయితే, ఆ స్థలంలో కరెంటు వైర్లు కిందకు ఉండగా.. అర్ధరాత్రి శంబారెడ్డి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేయడానికి యత్నించారు. ఆ సమయంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే, అక్కడున్న సినిమా సిబ్బంది అతడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాత్రిపూట విధులు నిర్వహించే నార్సింగి పోలీసులు సైతం ఎవరికీ సమాచారం తెలపకుండా హుటాహుటిన శవాన్ని చేవెళ్ల ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. శనివారం ఉదయం 6గంటల సమయంలో మోకిల పోలీసులు టంగటూరు మాజీ సర్పంచ్ గోపాల్‌కు ఫోన్‌చేసి రాత్రి మీ గ్రామంలో సినిమా షూటింగ్ జరిగింది. ఎవరో వ్యక్తి చనిపోయారు. శవం చేవెళ్ల ఆస్పత్రి మార్చురీలో ఉంది.. వెళ్లి గుర్తుపట్టండని సమాచారమిచ్చారు. గ్రామస్తులు వెళ్లి చూడగా శవం బద్దం శంబారెడ్డిదిగా గుర్తించారు. అయితే, విద్యుత్ షాక్‌తో చనిపోయాడా? లేక మరే విధంగానైనా చనిపోయాడా? అని గ్రామస్తులు, కుటుంబికులు అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోకిల సీఐ వీరబాబు తెలిపారు. మృతుడు శంబారెడ్డికి భార్య లావణ్య, కుమారుడు మణివర్ధన్‌రెడ్డి, కూతురు శిరీష ఉన్నారు.

పోలీసుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

శనివారం ఉదయం సంఘటనా స్థలంలో పంచనామా చేయడానికి వచ్చిన మోకిల ఎస్సై కోటేశ్వర్‌రావుపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో చిన్న సంఘటన జరిగినా సర్పంచ్‌కు సమాచారం ఇస్తారగానీ, కుటుంబీకులు, గ్రామస్తులకు చెప్పకుండా శవాన్ని ఎలా మార్చురీకి తరలించారని ప్రశ్నించారు. సినిమా వాళ్లతో పోలీసులు కుమ్మక్కై ఏకపక్షంగా మార్చురీకి తరలిస్తారా? అనాథ శవం అనుకున్నారా? అని గ్రామస్తులు విరుచుకుపడ్డారు. అనుమతి లేకుండా సినిమా షూటింగ్‌ను ఎలా తీస్తారని ప్రశ్నించారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. షూటింగ్ వాహనాలు గ్రామం నుంచి రాత్రిపూట వెళ్లడానికి పోలీసులే సహకరించారని గ్రామస్తులు ఆరోపించారు. కాగా, శవాన్ని కుటుంబీకులు, గ్రామపెద్దలకు సమాచారమివ్వకుండా పోలీసులు మార్చురీకి తరలించడంతో పాటు, కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ శంకర్‌పల్లి-గండిపేట నాలుగు లేన్ల రహదారిపై (మోకిల చౌరస్తాలో) సుమారు 2గంటల పాటు రాస్తారోకో చేశారు. రహదారిపై బైటాయించి పోలీసులకు వ్యతిరేకంగా గ్రామస్తులు, కుటుంబీకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో శంకర్‌పల్లి వైపు హైదరాబాదు వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీఎత్తున మోహరించారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూస్తానని కుటుంబికులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

మోకిల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

శంబారెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంలు మోకిల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని మృతుడి భార్య లావణ్య, కుమారుడు మణివర్ధన్‌రెడ్డి, కుమార్తె శిరీషలను పరామర్శించారు. చట్టప్రకారం చర్యలు తీసుకుని మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నార్సింగి ఏసీపీ రమణగౌడ్‌ను కోరారు. అదేవిధంగా శంబారెడ్డి కుటుంబికులను చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య పరామర్శించారు. మృతదేహం వద్ద నివాళులర్పించారు. గోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

రంగారెడ్డి అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. మొయినాబాద్ మండలంలోని చిలుకూరుకు చెందిన శ్రీకాంత్‌గౌడ్(19) శుక్రవారం రాత్రి హిమాయత్‌నగర్‌లో ఉండే తన స్నేహితుడి వివాహ వేడకకు వెళ్లి శనివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో బైక్‌పై తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో హిమాయత్‌నగర్ సమీపంలో డివైడర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటేష్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే శంషాబాద్ పరిధిలోని పెట్రోల్ మొబైల్-1 ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా శుక్రవారం రాత్రి మదన్‌పల్లి పరిధిలో హైవేపై శంషాబాద్ నుంచి షాద్‌నగర్‌కు వెళ్లే మార్గంలో ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ విషయమై డయల్ 100కు సమాచారం ఇవ్వగా పోలీసు సిబ్బందితో అక్కడికి వెళ్లి చూడగా మృతిచెందిన వ్యక్తి వయస్సు 30-35 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి శంషాబాద్ పీఎస్ ఆర్. కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.నరేందర్‌రెడ్డి తెలిపారు.

అదుపుతప్పిన కారు.. తప్పిన పెను ప్రమాదం

రంగారెడ్డి అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పడంతో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడిన ఘటన నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రాయన్‌గూడ సమీపంలోని పాత జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. టీఎస్08 హెచ్‌ఎన్9260 నెంబరు గల టాటా కారు హైదరాబాద్ నుంచి షాద్‌నగర్‌వైపు వెళ్తుండగా మార్గమధ్యలో నందిగామ మండలం చంద్రాయన్‌గూడ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఫెన్సింగ్‌రాడ్ పైకి ఎక్కింది. ప్రమాదం సమయంలో కారులో నలుగురు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ చెప్పారు.

మూడు టిప్పర్లు సీజ్

కేశంపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మట్టి తరలిస్తుండగా మూడు టిప్పర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు కేశంపేట సీఐ నరహరి తెలిపారు. శనివారం తెల్లవారుజామున పీసీలు సీహెచ్ శ్రీశైలం, పురుషోత్తంలు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండల పరిధిలోని మంగళగూడ సమీపంలో మూడు టిప్పర్లు ఎదురుగా వచ్చాయని తెలిపారు. ఇందులో రెండు టిప్పర్లలో మట్టిలోడు ఉండగా, మరొకటి ఖాళీగా ఉందని.. అనుమతులు లేవని డ్రైవర్లను ప్రశ్నిస్తే డబిల్‌గూడకు చెందిన పోతుల ప్రసాద్ టిప్పర్లను లీజుకు తీసుకుని బుచ్చిగూడ నుంచి దుబ్బచర్లకు మట్టిని తరలించాలని సూచించాడని, అతడి సూచనతో మట్టిని తరలిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అనుమతుల గురించి తమకు తెలియదని చెప్పారని వివరించారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా వారు పారిపోయారని తెలిపారు. కానిస్టేబుల్ సీహెచ్ శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుర్మిద్దలో 11న సీపీఎం సభ

యాచారం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీ బాధిత రైతుల సమస్యలను తెలుసుకునేందుకు ఈ నెల 11న మంగళవారం కుర్మిద్ద గ్రామంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పర్యటిస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.రాం చందర్ తెలిపారు. ఈ సందర్భంగా కుర్మిద్ద గ్రామంలో యాచారం, కందుకూరు మండలాలకు రైతులతో సమావేశం అవుతారని తెలిపారు. సభకు ఫార్మాసిటీ బాధిత రైతులం దరూ హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

షాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని షాబాద్ ఏఈ కోటేశ్వర్‌రావు ప్రకటనలో తెలిపారు. హైతాబాద్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న హైతాబాద్, హైతాబాద్‌తండా, మద్దూర్, పెదవేడు, పెదవేడుతాండ, దూసరకుంటతండా, అంకిగూడ, దామర్లపల్లి, నాందార్‌ఖాన్‌పేట్ గ్రామాల్లో నేడు(ఆదివారం) మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6గంటల వరకు మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు.

ప్రజా సమస్యలపై సీపీఎం సర్వే

యాచారం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంతన్‌గౌరెల్లి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం గ్రామ సీపీఎం నాయకులు కార్యకర్తలు ఇల్లిల్లూ తిరిగి ఆరా తీశారు. గ్రామంలో తాగు నీటి సమస్య, నీటితొట్ల నిర్వహణ, నిరుపేదలకు సామాజిక పింఛన్లు రావడం లేదని గ్రామస్తులు సీపీఎం బృందానికి ఫిర్యాదు చేశారు. భర్త చనిపోతే భార్యకు పింఛన్ రావడం లేదని, భర్త దివ్యాంగుడై మరణిస్తే భార్యకు పింఛన్ మంజూరు చేయకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు సీపీఎం బృందానికి వివరించారు. కార్యక్రమంలో నాయకులు ధావ్‌నాయక్, చందూనాయక్ తదితరులున్నారు.

అభివృద్ధిలో పాలుపంచుకోవాలి

కడ్తాల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో రాజకీయాలకు చోటులేకుండా ప్రజలంతా పాలుపంచుకోవాలని ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. కడ్తాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి సుజాత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు. సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

- పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు

ఆమనగల్లు, మార్చి8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దర్శనీయ స్థలంగా వెలుగొందుతున్న ఆమనగల్లు పట్టణంలోని శ్రీవెంకటగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అలివేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంతో పాటు రంగారెడ్డి, హైదరాబాద్, నాగర్‌కర్నూల్, నల్గొండ, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల నుంచి తలంబ్రాలతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి ఆలయ గర్భగుడి నుంచి ఉత్సవ నిర్వాహకుడు, ఆలయ ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్యులు కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. రాధాకృష్ణశర్మ, అనిల్‌జోషి, జానకిరామయ్య, ఆనందశర్మ, నిహాల్ జోషిలు కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బికుమాండ్ల సుజాతనర్సింహ, డాక్టర్ వాసుమంజుల, శ్రీనివాసులుమంజుల, యాదయ్యసునిత, పాపిశెట్టి రాముశ్వేత, వీరబొమ్మ రామ్మోహన్‌మాధవి,మాండెం చంద్రశేఖర్‌రాజేశ్వరి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన కండె సీతమ్మలింగయ్య దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి, నాయకులు, ప్రజాప్రతినిధులు ఎర్రవోలు శ్రీను, విక్రమ్‌రెడ్డి, మహేశ్, కండె భాస్కర్, కండె సుమన్, చెన్నకేశవులు, ఎంగళి శ్రీధర్, లక్ష్మణ్, బికుమాండ్ల పాండయ్య, తదితరులున్నారు.



ఆమనగల్లు : వేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఘనంగా వేణుగోపాల స్వామి పరిణయం

తలకొండపల్లి : కల్కిదోన గోపాల స్వామి గుట్టపై గల శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ ఫౌండర్‌ట్రస్టీ చైర్మన్ సిద్దాంతి పట్టాభి రామశర్మల ఆధ్వర్యంలో అర్చకులు కృష్ణమూరి, శ్రీనివాసశర్మ, గోపాల కృష్ణ, నితిన్ సిద్దాంతి, బిజుమళ్ల సత్యనారాయణమూర్తి లు వేదమంత్రాలు, బాజాభజంత్రీల నడుమ కల్యాణాన్ని జరిపించారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ స్వప్న భాస్కర్‌రెడ్డి, బికుమాండ్ల శ్యామ్‌సుందర్, ఏమిరెడ్డి రంగారెడ్డి, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

కడ్తాల్ : అన్మాస్‌పల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, ప్రత్యేక పూజలు అత్యంత నిర్వహించారు. మహేశ్వర మహా పిరమిడ్ చైర్మన్, అశోక బిల్డర్స్ అధినేత కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డినీరజ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు, ప్రజలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్‌లు హాజరయ్యారు. మాజీ సర్పంచ్ శంకర్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, నాయకులు వేణుగోపాల్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రావిచెడ్ వేంకటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన కడ్తాల మండలం రావిచెడ్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం 14వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటి(ఆదివారం) నుంచి 13వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. రావిచేడ్‌తో పాటు కడ్తాల్, తలకొండపల్లి , ఆమనగల్లు, కేశంపేట, కందుకూరు ,మహేశ్వరం తదితర మండలాల నుంచి బ్రహ్మోత్సవాలకు భక్తుల రాక నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రముఖ అర్చకుడు వింజమూరి రామానుజాచార్యులు పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగుతాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, మాజీ సర్పంచ్ భారతమ్మవిఠలయ్యగౌడ్, మహేందర్‌రెడ్డిలు కోరారు.

బాలాజీ వేంకటేశ్వరాలయంలో పూజలు

రంగారెడ్డి అర్బన్ : రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని శంషాబాద్ మండలం రామంజపూర్‌లో శనివారం శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి నాయకులతో కలిసి కల్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. బీజేపీ నాయకులు ప్రేమ్‌రాజు, ప్రభాకర్, కోలాన్ ప్రదీప్, సాయి కోలాన్, జగ్గవన్, శ్రీను, వంశీ యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, నాగేశ్, మహేశ్‌కుమార్, రాజేందర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్ మండలం రామంజపూర్ బాలాజీ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

రూ.3 కోట్ల దీర్ఘకాలిక పంట రుణాలు

- డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్


ఆమనగల్లు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పీఏసీఎస్ ద్వారా వానాకాలం పంటల సాగు, దీర్ఘకాలిక రుణాల కింద రూ.3కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ తెలిపారు. ఆమనగల్లు పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం పాలక సమావేశం నిర్వహించారు. వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పంట రుణాల మంజూరు, రికవరీ, సంఘం బలోపేతం, తదితర విషయాల గురించి చర్చించారు. పీఏసీఎస్ పాలకవర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు పాలకవర్గం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటేశ్ మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ పంట రుణాలు అందిస్తూ వ్యవసాయ రంగం అభివృద్ధి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. యాసంగి సీజన్‌లో పీఏసీఎస్ ద్వారా రూ.2.40 కోట్లు రుణాలు అందించినట్లు చెప్పారు. వానాకాలం పంటల సాగు కు రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల, ముద్విన్‌లో పీఏసీఎస్ ద్వారా ఎరువులు, విత్తనాల విక్రయ కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వైస్ చైర్మన్ సత్యం, సభ్యులు వీరయ్య, వెంకటయ్య, వెంకటేశ్, దోల్యానాయక్, తదితరులున్నారు.

మైసమ్మ ఆలయంలో విగ్రహాల చోరీ

రంగారెడ్డి అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మొయినాబాద్ మున్సిపల్ పరిదిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో ఉన్న మైసమ్మ దేవాలయంలో విగ్రహాలు మాయమయ్యాయి, విషయం తెలుసుకు కున్న బీజేపీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు శనివారం అక్కడికి వెళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిని ప్రశ్నించగా సమాధానం చెప్పలేదు. దాంతో వారు అక్కడ ఆందోళనకు దిగారు. అదే స్థలంలో నూతన దేవాలయం నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, బీజేవైఎం రాష్ట్ర ట్రైయినింగ్ సెల్ కన్వీనర్ చిలుకూరు సుధీంద్ర, భజరంగ్‌దల్ గోరక్ష ప్రముఖ్ సురేష్ గౌడ్, బాబు నాయక్, విక్రమ్‌రెడ్డి, ఎల్లేష్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మంచాల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆరుట్ల గ్రామపంచాయతీ బుగ్గతండాలో శనివారం రూ.10లక్షల నిధులతో అభివృద్ధి పనులను మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్లేశ్ ప్రారంభించారు. ఇందులో రూ.5లక్షలతో సీసీ రోడ్డు, రూ.5 లక్షలతో ఎస్టీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, మోహన్‌నాయక్, లాలగారి శ్రీకాంత్, గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేష్, లచ్చిరాం, బుట్టి కృష్ణ, దాసరమోని రమేష్, శ్రీనివాస్, తదితరులున్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎల్లేశ్

సంక్షిప్తంగా..

యాచారం : మంతన్‌గౌరెల్లిలో కొంతకాలంగా జనం తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మాజీ ఎంపీటీసీ అరవింద్‌నాయక్ గమనించారు. గోవింద్‌రెడ్డి వీధిలో తాగునీటి కోసం జనం పడుతున్న ఇబ్బందులను గమనించారు. దాంతో శనివారం తన సొంత డబ్బుతో బోర్ వేయించారు. అరవింద్‌నాయక్‌ను గ్రామస్తులు అభినందించారు.

కడ్తాల్ : మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాగి అంబలి కేంద్రాన్ని సందర్శించారు. నాయకులతో కలిసి అంబలి పంపిణీ చేశారు.

ఆమనగల్లు : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సరం క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆమనగల్లు పట్టణంలో నిర్వహించారు. బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.